చక్కెర కె.జి. 3రూపాయలు!

'నారాయణ! నారాయణ అంటూ నారదుడు "వైకుంఠం"లోకి ప్రవేశించాడు

'సూర్యోదయం, నారదోదయం ఒక్కసారే జరిగాయ్'

"ఏమిటి నారదా! ఇంత పొద్దున్నే బదింటికే బయల్దేరి వచ్చావ్" అడిగాడు విష్ణువు

"ఏం చెప్పమంటారు స్వామీ? రోజు రోజు ప్రొద్దున్నే లేచానా! మాతృదేవతను ఒక కప్పు కాఫీ అడిగాను 'కాఫీయా నాయనా! చక్కెరలేక మీ నాన్నగారికే చేసివ్వలేదు వైకుంఠం వెళ్ళి నువ్వు తాగి ఈ ఫ్లాస్కులో ఒక రెండు కప్పులు తీసుకురా నాయనా' అని ఇలా పంపించింది"

"చాలా తలనొప్పిగా ఉంది! అమ్మా లక్ష్మీదేవీగారూ! స్ట్రాంగ్ కాఫీ ఒక కప్పు నా మొహానపడేసి ఈ ఫ్లాస్కులో మరో రెండుకప్పులు పోస్తే సంతోషిస్తాను" అన్నాడు నారదుడు.

"దేవీ! విన్నావుగదా! నా భక్తుని మొర! తక్షణం ఆ సంగతి చూడు" ఆజ్ఞ జారీచేశాడు విష్ణువు.

"నా కంతగా చెప్పాలిటండీ! అసలు నారదుడు ఇంత ప్రొద్దున్నే రావడంతోటే అనుకున్నా! కాఫీ కోసం అని మొన్ననే పార్వతీదేవి దగ్గరికెళ్ళి ఒక అరకేజీ చక్కెర అప్పడిగాను గణపతి మూడ్రోజుల్నుంచీ 'స్వీట్' చేయమని అడుగుతున్నాడట ఆవిడ అరకేజీ ఇవ్వలేను, అని ఒక గ్లాసుడు ఇచ్చింది. అదే పదివేలనుకొని తీసుకొనివచ్చా అదీ ఈ రోజుతో సరి" నేనేం చేయగలను అన్నట్టుగా చెప్పింది లక్ష్మి

విష్ణువు నిశ్చేష్టుడయ్యాడు నారదుడికి కొద్దిగా బాధనిపించినా తనని తాను సమర్థించుకొన్నాడు. "పాపం! ఆవిడ మాత్రం ఏం చేస్తుందీ? రోజూ తనొచ్చి తాగటం లేదూ" అనుకొన్నాడు.

"సరేలే! కైలాసం వెళ్తాను. సాయంత్రం ఈ చక్కెర కొఱత గురించి సమావేశమేర్పాటు చేయాలి. దీనికి పరిష్కార మాలోచించాలి అందరికీ చెప్పి వస్తాను. వెళ్తున్నాను స్వామీ!" చెప్పాడు నారదుడు

విష్ణుమూర్తికి కొద్దిగా బాధ కలిగింది.

"నారాయణా!" అనుకుంటూ నారదుడు లేచి వెళ్ళిపోయాడు

* * *

కైలాసంలోకి ప్రవేశించాడు నారదుడు. అక్కడి సీను చూడగానే తన కాఫీ సంగతి దేవుడెరుగు గాస్ ఫ్లాస్కును మాత్రం దాచిపెట్టాడు

పార్వతి తన కప్పులోనుంచి సగం కాఫీ శివుడికిచ్చింది "ఇక లేదు స్వామి కాఫీ!" అంటూంది

"చేసుకోవాలంటే ఎంత కాఫీయైనా చేసుకోవచ్చు కాని దానిలోకి 'చక్కెర' లేకపోతే ఇంత సంగతులు" అనుకొన్నాడు — పైకి అనేశాడు కూడా నారదుడు.

"నారదుడుగారేవిటి ఇలా ప్రొద్దున్నే విచ్చేశారు? కొంపదీసి ఏదైనా తగూ తీసుకునిరాలేదు కదా" అన్నాడు శివుడు.

"అత్యవసరమైన సందేశ మొకటి తీసుకొచ్చాను. మనందరకూ చక్కెర కొఱత ఏర్పడింది అందరికీ తెల్సిన విషయమే భూలోకం నుండి దిగుమతి చేసుకొనే చక్కెరకు కూడా కరువేర్పడింది నైవేద్యంలో ఎవరూ చక్కెర పెట్టడం లేదు దీనికి పరిష్కారమార్గంగా ఈ రోజు సాయంత్రం అందరం ఒక సమావేశం ఏర్పాటు చేద్దాం. దీన్ని వైకుంఠంలో నిర్వహిద్దాం" కేవలం అది చెప్పటానికే అన్నట్టుగా గడగడా చెప్పేశాడు నారదుడు

"మంచి ఆలోచన, దీనికి తప్పకుండా హాజరవుతాం" అన్నాడు శివుడు.

అప్పుడే గణపతి వస్తున్నాడు

"ఉదయాన్నే ఎక్కడికో వెళ్ళి వస్తున్నారు! విఘ్నేశ్వరుడుగారు" నారదుడి ప్రశ్న.

"అలా భూమ్మీది హోటలు కెళ్ళి ఒక్కప్పు కాఫీ తాగొస్తున్నాను. ఏమిటీ ఏంటో సమావేశమంటున్నారు?" తిరిగి తనే ప్రశ్నించాడు

వివరించాడు నారదుడు "మరిక సెలవు పుచ్చుకుంటా" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు నారదుడు

* * *

సమావేశం ఏర్పాటయింది లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరులు సరస్వతీ బ్రహ్మలు తమ తమ ఆసనాలపై కూర్చొని ఉన్నారు. లక్ష్మీదేవి అందరికీ ఒక్కొక్క కప్పు "బెల్లం కాఫీ" తెచ్చిచ్చింది.

మధ్యలో అన్నాడు నారదుడు, "అసలు ఈ చక్కెర కొఱతకు కారణమేమిటి?"

"ఏదయితేనేం! మొత్తానికి మన భక్తులైన భారతీయులూ, మనమూ కూడా బాధపడుతున్నాము కదా!" వ్యక్తపరిచాడు విష్ణువు.

"అయితే అందరం కలిసి ఒక పనిజేద్దాం. మన భక్తులున్న భారతదేశానికి వెళ్ళి, అక్కడ కిలో చక్కెర ఎలా ఉందో కనుక్కొని, దేశంలో ఉన్న చక్కెరనంతా

జిల్లాలవారీగా కొనుగోలు జేసి, ఒక్కొక్క ఊర్లో ఒక్కొక్క దుకాణం స్థాపించి, ఒక్కొక్క ఊర్లో మూడ్రోజుల చొప్పున ఉండి, తక్కువ ధరకు అమ్మి, మన భక్తులను రక్షిద్దాం. నష్టం మనం భరిద్దాం'' శివుడు తన అభిప్రాయాన్ని వెలువర్చాడు.

''మంచి సలహా! ఎల్లాగూ లక్ష్మీదేవిగారు మనతో సహకరిస్తారు కాబట్టి డబ్బుకు కొరవుండదు'' గణపతి అన్నాడు.

''అవునవును; ఓ నెల్రోజుల పాటు ఇండియాలో ఉండి అన్నింటినీ విశేషాల చూడటమే కాకుండా మన చక్కెరతో మంచి కాఫీ కూడా తయారుజేసుకోవచ్చు'' నారదుడు గొప్పగా అన్నాడు.

అందరికీ ఈ ఆలోచన నచ్చింది. ఒక శుభ ముహూర్తాన అందరూ భూలోకంలోని భారతదేశానికి దిగి వచ్చారు.

* * *

మొట్టమొదట అతి కరువుగా ఉన్న జిల్లా కెళ్ళి ఆ జిల్లాలో, నగరాల్లో, ఊళ్ళల్లో ఉన్న చక్కెర అంతా లక్ష్మీదేవి సహకారంతో కిలో ఇరవై రూపాయల చొప్పున రహస్యంగా కొనుగోలు చేశారు.

జిల్లాలో కరక్టుగా సెంటర్‌లో ఒక దుకాణం అద్దెకు తీసుకొని ''త్రిలోక శర్కర నిలయం'' అన్న పేరతో తెరిచారు. ప్రజలకాశ్చర్యం, ఆనందం ఒక్కసారే కలిగాయ్. అసలే చక్కెర దొరకట్లేదను కొంటూంటే 'చక్కెర దుకాణం' అందునా కె.జీ. మూడ్రూపాయలు. కొంతమందికి అనుమానంకూడా వచ్చింది. ''అదసలు నిజమైన చక్కెరేనా'' అని. కొనేవాళ్ళు కొనుక్కుంటుంటే, కొంతమంది జిల్లా కలెక్టరును, ఇన్‌స్పెక్టర్‌ను వెంటబెట్టుకుని దుకాణం దగ్గిర కెళ్ళారు.

కూలీలతో మోపిస్తున్న చక్కెర బస్తాలను నారదుడు దుకాణంలోకి చేర్పిస్తున్నాడు.

విష్ణువు త్రాసు దగ్గర నిల్చున్నాడు. శివుడు సంచుల్లో నింపుతున్నాడు. గణపతి సప్లై జేస్తున్నాడు.

సరస్వతి, లక్ష్మి, పార్వతీగార్లు వచ్చిన డబ్బును లెక్క చూస్తున్నారు. బ్రహ్మ అమ్మకం, కొనుగోలు — లెక్కలు కడ్తున్నాడు.

''చక్కెర కొనుక్కోవడానికి కలెక్టరుగారితో సహా అందరూ వచ్చినట్టున్నారే'' ముగ్గురు దేవతా తల్లులు గుసగుసలు

''రండి! రండి కె. జీ మూడ్రూపాయలు,'' విష్ణువు ఆహ్వానించాడు

''మేము కొనుక్కోవటం సంగతి తర్వాతి గానీ ముందీ చక్కెర ఎక్కడిదో చెప్పండి? ఏమిటి ఇన్ని బస్తాల చక్కెరే? అసలిది ఒరిజినల్ చక్కెరేనా'' గంభీరంగా ప్రశ్నించాడు అధికారి.

'అదేమిటండీ అలాగంటారు? కె. జీ. 20 రూ॥ చొప్పున బ్లాక్‌లో కొని మరీ మేం అమ్ముతున్నాం . . యిది జనానికి సాయం చేయడానికే''

అందరూ విరగబడి నవ్వారు. ''గొప్ప దేశభక్తులు బయల్దేరారు.'' వ్యాఖ్యానాలు, విమర్శలు, ఎగతాళి మాటలు, నవ్వులు

పాపం! దేవతలు నిర్ఘాంత పోయారు.

''అసలీ చక్కెరను సరీక్షించాలి. అప్పటిదాకా సరుకు స్వాధీనం చేసుకొని మిమ్మల్ని అరెస్టు జేస్తున్నాము'' అన్నాడు.

చక్కెరబస్తాలన్నిటినీ పోలీసులు స్వాధీన పర్చుకున్నారు.

పాపం ఎనిమిదిమందీ అరెస్టయ్యారు. ఒక రాత్రంతా జైల్లో ఉన్నారు. చక్కెర బస్తాలు మాత్రం చేరవల్సిన చోటుకే చేరాయ్. రాజకీయ నాయకుల ఇళ్ళకీ చేరాయ్, మళ్లీ మార్కెట్‌లోకి ''దొంగ ప్రవేశం'' కోసం

* * *

తెల్లవారింది. విష్ణువు దినపత్రికల కోసం చూస్తున్నాడు దినపత్రికలొచ్చాయి

''రసాయనాలతో తయారుచేసిన ఆరోగ్య హానికరమైన చక్కెర అమ్ముతున్న దొంగ వ్యాపారస్థుల అరెస్ట్! చక్కెర బస్తాల స్వాధీనం'' అని వార్త అధికారి విడుదల చేసిన ప్రకటనగ పడ్డది.

''మెయిన్ హెడ్డింగ్'' జూసి మూడు లోకాల దేవుళ్ళూ ముక్కున వేలేసుకుని అక్కణ్ణించి తక్షణం మాయమై పోయారు.

— మిల్లరీ జాన్సన్

ఎడారిలో మంచినీరు

కారాకుమ్ మధ్యాసియాలోని పెద్దఎడారి. సోవియట్ దేశంలోకల్లా చాలా పెద్ద ఎడారి. ప్రపంచంలో నాల్గవ పెద్ద ఎడారి. దీని విస్తీర్ణం దాదాపు 4 లక్షల చదరపు కిలోమీటర్లు అంటే ఇది బ్రిటన్, ఇటలీ, లేదా నార్వే దేశాల వైశాల్యానికంటే హెచ్చు తుర్క్‌మెనియా రిపబ్లిక్‌లో నాల్గింట మూడువంతుల ప్రాంతాన్ని ఈ ఎడారి ఆక్రమిస్తూ వుంది.

తుర్క్‌మెనియా రిపబ్లిక్‌లో మంచినీటి కొరత విపరీతంగా వుంది. కారాకుమ్ తూర్పు అంచున ప్రవహించే అమూదర్యా నది ఒక్కటే ఈ ప్రాంతంలో చాలాకాలం వరకూ పెద్దనదిగా వుండేది. ఇక్కడి ప్రజానీకం మంచినీటికి ఆ నదిమీదనే ఆధారపడుతూ వుండేవారు. ఇప్పుడు చాలా లోతైన లెనిన్ కారాకుమ్ కాల్వ త్రవ్వబడింది. ఇది 1300 కిలోమీటర్లు పొడవుగల్గి — కాస్పియన్ సముద్రంతో అనుసంధానించబడింది.

మానవ నిర్మిత కోపెత్ దాగ్ సముద్ర నిర్మాణం నేడు పూర్తిగా వచ్చింది ఇది మధ్యాసియాలోని అతిపెద్ద రిజర్వాయర్లలో ఒకటి. ఇది 72 వేల హెక్టార్ల భూములను సాగులోకి తెస్తుంది. తుర్క్‌మెనియాలో ఇలాంటి పథకాలు యిప్పటికే 17 వున్నాయి. ఈ పథకాలు సువిశాల ప్రాంతాలను సస్యశ్యామలం చేయడానికీ, పరిశ్రమల అభివృద్ధికీ తోడ్పడినాయి.

అయితే తుర్క్‌మెనియాకు ఈ నీరు ఇంకా చాలదు. దానికిగాను తుర్క్‌మెనియా శాస్త్రవేత్తలు స్థానిక జలాలను సేకరించి, ఉపయోగించుకొనే ప్రస్తుత పద్ధతులను మెరుగుపరచడంతోపాటు, ప్లాస్టిక్ ఫిలింలపై వర్షపునీటిని సేకరించి నిల్వవుంచే శాస్త్రవిజ్ఞాన పద్ధతులను పెంపొందిస్తూ వున్నారు. విచిత్రమేమిటంటే, ఈ ప్రాంతంలో అమూదర్యా నదీ సరివాహక ప్రాంతంలో ఒక వంతు వర్షం కురిస్తే, దానికి నాలుగురెట్లు ఎక్కువగా వర్షం ఎడారిలో కురుస్తుంది.